# THE TRUE REFUGE

**By W.H. Pearce    అనువాదము పురుషోత్తము చౌధరి**

## నిజమైన ఆశ్రయము (1861)

ఒక వృద్ధుడున్ను వొక పడుచువాడున్ను మర్గస్తులై వెళ్లుతూ యీ ప్రకారముగా సంభాషించిరి. – వృద్ధుడు పడుచువాని చూచి ఓ సహోదరుడా మనము యిద్దరమూ తోడుగా వెళ్లేటప్పడు మాట్లాడుతూ పోవడము మంచిది కాదా అని యనెను. అందుకు పడుచువాడు అయ్యానీ చిత్తము దేని చెప్పుటకు నీకు అనుకూలమో దాని చెప్పుమని పలికెను.

**వృద్ధుడు :** ఓ సహోదరుడా, ముందుగా వొక మాట అడుగు తున్నాను. నీవు రక్షణమార్గము నమ్మియున్నావా!

**పడుచువాడు :** అయ్యా నేను మనవి చేస్తున్నాను వినుము లోకమందు పదిమందికి యేది గతి అవునో, అదే నాకున్ను గతి అవును.

**వృ :** మంచిది సహోదరుడా, వారి యొక్క గతి యెట్టిది దాని చెప్పుము వింటాను.

**ప:** అయ్యా! దానియొక్క విశేషమును గురించి నేను యేమిన్ని చెప్పుటకు శక్తుడను గాను. మరిన్ని అందులో నాకు మిక్కిలీ జ్ఞానములేదు. యెందుచేత నంటే నేను పండితుడను కాను. పండితులైన వారు యే మార్గమందు నడువుమని చెప్పుదురో ఆ మార్గమందు నేను నడుతును.

**వృ :** మంచిది ఆ మార్గమేది? మరిన్ని నీకు రక్షణోపదేశము యేలాగు వారు చేతురు?

**ప :** అయ్యా వారు సమస్తమైన వారి మతములు వేరుగా వున్నవనిన్ని కృష్ణుని యారాధించితే ముక్తి కలదనిన్ని చెప్పుతున్నారు.

**వృ :** సహోదరుడా, అది యేలాగు కలుగును? కృష్ణుడు కంసుడనే రాజును చంపుటకున్ను ఆయన రాజసింహాసనమును పుచ్చుకొను టకున్ను వచ్చి యుండెను. వాడు మనుష్యుల యొక్క రక్షణ కొరకు యే కార్యమున్ను చేసినవాడు కాడు కాగా కృష్ణుని ద్వారా రక్షణ యే చొప్పున కలుగును? మరిన్ని చూడుము వాడు ధర్మరాజుయొక్క నిజసేవకుడు గాని అన్యుడు కాడు. మరిన్ని వాని అబద్ధమును పలికేటట్టు చేసి ఆ పాపమువల్ల నరక దర్శనము చేయించెను. కృష్ణుడు అప్పుడు రక్షించుటకు శక్తుడైతే యెందుకు ధర్మరాజు నరక దర్శనము చేయవలెను.

**ప :** కృష్ణుడు రక్షించుటకు శక్తుడు కాకుంటే జగన్నాథుని దర్శించుటకు అనేకులు యేల పరుగెత్తి వస్తున్నారు?

**వృ :** వినుము సహోదరుడా యీ మాటయొక్క భావము వేరే యున్నది జగన్నాథుడనే శబ్దార్థము జగత్తుకంతటికి నాథుడున్ను జగదుత్పత్తిస్థితి లయములకు కర్తయున్ను యనేదే అయితే లోకులందరూ దేని దర్శించుటకు పరుగెత్తి వస్తున్నారో అది జగన్నాథుడుకాడు. మరి యేమంటే అది కర్రముక్క చేత చేయబడిన బొమ్మ దాని చూస్తే యేమి ఫలము కలుగును? మరిన్ని యీ బొమ్మముందట రథయాత్రా సమయమందున్ను యింకా అనేక కాలముల యందున్ను యెంత అపవిత్రమైన పాటలను పాడుతున్నారో యెంత ఆయాసముతో శరీర వికారాది క్రియలను చేతురో చూడుము. అది అంతా చూచినా వినినా యెవ్వరి మనస్సున్ను పవిత్రము కానేరదు. పాపము అధికమవును నరక హేతువున్ను అవును.

**ప:** ఈ మాట నిజము. అయితే మహా ప్రసాదమును భక్షించి నందువల్లనయినా అనేక తీర్థస్నానములను చేసినందువల్ల నయినా యేమైనా ముక్తి కలుగునాలేదా?

**వృ :** లేదు చూడుము. మహాప్రసాదమునైనా మరియే ప్రకారమైన అన్నమునైనా భక్షించితే వుదరపోషణమవును. యిది నిశ్చయము. అయితే

అందువల్ల ఆత్మకు పద్ధతి యెంత మాత్రమున్ను లేదు. మరిన్ని స్నానాదులు లౌకిక కర్మములు గాని మోక్షము నిచ్చేవిగావు యెవ్వడు మాటి మాటికి పాపము చేస్తూ వుండునో వాని గంగా జలములైనా పవిత్రము చేయలేవని వ్రాసియున్నది. యిందుకు శూలపాణియొక్క వాక్యము – **"కుర్యాత్పునః పునఃపాపం నచగంగా పునాతీతం"॥**

ప : అయ్యా యిది మిక్కిలీ ఆశ్చర్యము. యేమంటే జగన్నాథుని యొక్క ఆరాధనవల్ల ముక్తిలేని పక్షమందు పండాలు అన్ని దిక్కులకు పోయి మనుష్యులను యెందుకు తోడ్చుకొని రావలెను.

వృ : దాని కారణము చెప్పుతాను వినుము. యీవిధ విగ్రహమైన జగన్నాథుని దర్శనముచేసితే నానా విధమైన దాన దక్షణనైవేద్యము లను అర్పించుటకు అగత్యమై యుండును అందువల్ల పండాలకు చాలా లాభము వున్నది. అయితే నిజమైన జగన్నాథుని యొక్క ఆదాధన చేసితే యిటువంటి లాభము లేదు. లోకులు యీ బొమ్మయొక్కపూజ యెప్పుడు మానుదురో అప్పుడు పండాలయొక్క లాభమునకు నష్టము కలిగి భిక్షాన్నమైనా వారికి దొరకక పోవును.

ప : మంచిది అయ్యా మత్స్యకూర్మాది దశావతారములను భజించితే అవశ్యము ముక్తిగలుగదా?

వృ : ఓ సహొదరుడా, కొందరు ఆలాగు చెప్పుతున్నారు గాని వాటివల్ల విముక్తి యేచొప్పున సంబవించును?

ప : అయ్యా వాటివల్ల రక్షణ లేకపోయెను. అయితే మరియే దేవతనైనా ఆరాధించితే రక్షణ కలుగునా లేదా?

వృ : ఓ నహొదరుడా, యిది అంతా నిష్ఫలము. యిందుకు భగవద్గీతలో **"యోమాం సర్వేషు భూతేషు సంతమాత్మాన మీశ్వరం! హిత్వాన్యంభజతే మూఢో భస్మన్యే నజుహొతినః"** ॥అని వ్రాసి యున్నది.

సర్వ భూతముల యందు వ్యాపించి యున్నటువంటిన్ని ఆత్మనై యున్నటువంటిన్ని ప్రభువునై యున్నటువంటిన్ని నన్ను విడిచి అన్య దేవతలను భజనచేసే మూఢుడు బూడిదెలో నెయ్యివేల్చినట్లు.

ప : మంచిది యీ ప్రమాణమును నీవు చెప్పినావు. యిది దేవతలనే ప్రతిమలకు చెల్లును. సత్యమే. అయితే యీ కర్ర బొమ్మలున్ను రాతి బొమ్మలున్ను యెవ్వరియొక్క ప్రతిమూర్తులో వారు శక్తి మంతులు గదా: నిజముగా వారు రక్షించలేరా?

వృ : రక్షించలేరు. యేలాగురక్షించగలరు. మీ శాస్త్రానుసారముగా విచారించి చూడుము. దుర్గకాళి యిటువంటివి మిక్కిలీ కఠినులైన రాక్షసు లను వధించి కేవలము రక్తపానము చేసెను. మరిన్ని బ్రహ్మ తనకొమార్తె యందు ఆసక్తి పొందెను. చంద్రుడు గురుభార్యను వరించెను. ఆప్రకారమే కృష్ణుడున్ను గోప స్త్రీలతో క్రీడచేసి తన స్నేహితుడైన ధర్మరాజును అబద్ధము చెప్పుటకు అనుమతింప చేసెను. యిందువల్ల వారందరూ కేవలము పాపులై యున్నారు గదా పాపాత్ములను యేలాగు రక్షించుటకు శక్తిగల వారవుదురు. వ్యాకరణ టీకా కారుడైన దుర్గాదాను వ్రాసిన గ్రంథమందు చూడుము. అందులో యీ ప్రమాణము వున్నది. యేలాగంటే-

"స్వయమశుద్ధఃకథంపరాన్ సాధయతి" ॥

తాను అశుద్ధుడై పరుని శుద్ధుని చేసుటకు శక్తిగల వాడౌనా? విచారించుము సహోదరుడా నేను యీ మాటలన్నిటినిన్ని చెప్పితిని. అయితే వారిని నేను నిందచేయలేదు. యీ సమస్త వృత్తాంతము హింధువులయొక్క శాస్త్రముల యందు వ్రాయబడియున్నది.

ప : అవునయ్యా యీ మాటలన్నీ మా శాస్త్రముల యందు వ్రాయబడి యుండడము నిజమే. నీవుయేమిన్ని అన్యాయము చెప్పలేదు.

**వృ :** మంచిది యీ మాట నిజమని తెలుసుకొనిన యెడల రక్షణ కొరకు వారి యందు యేలాగు నమ్మిక వుంచ గలవు? చూడుము హిందూ శాస్త్రముల యందు దేవతలను గూర్చి యీ చొప్పునవుంటే వారున్ను మనుష్యులున్ను ఏకముగా పాపులయియున్నారు. మరిన్ని న్యాయము తీర్చే అంత్య దినమందు సత్యము గల దేవుని యెదట తామే నిలువనేరకనుందురు. తమ పాపములను గురించి వుత్తరము యివ్వనేరక వుందురు. కాగా రక్షణయొక్క ఆశచేత వారికి యెవ్వరు బద్ధులై యుందురో వారు నష్టమును పొందుదురు ఆ కాలమందు ఆ దేవతలు యేమిన్ని చేయ నేరకనుందురు. మరిన్ని పాపముయొక్క చెడ్డతనము యెటువంటిదో దాని చూడుము. పాపమువుండగా దేవుని సముఖమందు వారు నిలువ నేరకనుందురు. దేవునికి పాపము ఆసహ్యాముగా వున్నది మరిన్ని దేవుని యొక్క యథార్థ్యమైన సేవ చేసుటవల్ల మనస్సు పవిత్రమవును. అయితే యింతకాలము ఆ దేవతారాధన చేసుటవల్లనీ మనస్సు శుద్ధిపొందెనా లేదు. తెలుసుకొని చూడుము. ఆ దేవతలయొక్క పూజ చేసుట కేవలము వేడుకయున్ను మనోభిలాష పూర్తిన్ని అవును యిందువల్ల నీ పాపము రవంతైనా విమోచనము కాదు. సరే కదా మరింత యెక్కువవును.

**ప :** అయ్యా యిది ప్రమాణమే యీ మాటకు నేను వొప్పుకొంటున్నాను యిందువల్ల బోధపడేది యేమంటే మేము యే ధర్మమును ఆశ్రయించి యున్నామో అది అంతా వట్టిదే. అందువల్ల రక్షణ కాదు. అయితే సర్వేశ్వరుని నామ గుణ కీర్తన చేసి ముక్తుడనౌదును.

**వృ :** మంచిది సహోదరుడా దేవుని యొక్క నామము ద్వారా తరించేటందుకు నీకు ఆలోచన కలిగి యున్నది. అయితే అందుకు సందర్భము లేకుండా చెప్పితివి యేమిఫలము కలుగును, చూడుము సహోదరుడా నీ పేరేమి చెప్పుము.

ప : అయ్యా నా పేరు దేవదాసు.

వృ : నీకు సంతానము కలదా లేదా?

ప : కలదయ్యా నీవు దీని యెందుకు అడిగినావు?

వృ : మంచిది చూడుము. నీవు యెక్కడనుంచి యైనా యింటికి వచ్చేటప్పుడు నీ కుమారుడు యెదురుగా పరుగెత్తి నీ సమీపమునకు వచ్చి అనేక పర్యాయములు తండ్రివియైన ఓ దేవదాసూ తండ్రివియైన దేవదాసూ తండ్రివియైన దేవదాసు అని పిలిచితే అటువంటి కుమారుని యే చొప్పున యెంచుదువు.

ప : వాని కేవలము వెర్రివాడని యెంచవలెను.

వృ : ఆ చొప్పున యెవడు దేవుని మాటిమాటికీ పిలుచునో వానిన్ని ఆ ప్రకారమే యెంచవలెను.

ప : నిజమయ్యా. మనువు యిటువంటి యాలోచన నాకు లేకుండెను. మంచిది దేవుని నామముద్వారా ముక్తి రాకపోతే పుణ్యమును చేసుకొని యుంటే పాపమునుంచి ముక్తి పొందరాదా?

వృ : కాదు కాదు సహెూదరుడా ఆలాగు నమ్మడము వ్యర్థము.

ప. వ్యర్థమే మి అయ్యా పుణ్యమువల్ల పాపము హరించునని అందరూ చెప్పుతారు.

వృ : వ్యర్థమే. దాని కారణము చెప్పుతాను వినుము. సురథుడనే రాజు వెయ్యివేల పుణ్యములను శాస్త్రానుసారముగా చేసిన్ని పాపమును తిరిగీ అనుభవించెను. మరిన్ని భారతమందు వ్రాసియున్నది యేమంటే.

"పుణ్యం క్షరతి కీర్తనాత్".

పుణ్యకార్యము చేసి చెప్పితే ఆ పుణ్యము నష్టమౌను యిందు నిమిత్తము యే మనుష్యుడు పుణ్యకార్యము చేసి చెప్పకుండా వున్నాడో అటువంటి మనుష్యుడు యేడి?

ప : ఓ అయ్యా నేను యే మాట చేప్పుతున్నానో ఆ మాట నీవు ఖండిస్తున్నావు. మంచిది యీ మారు వొక మాట చెప్పుతాను వినుము. పాపమును పరిహరించుటకు ప్రాయశ్చిత్తము హోమము యజ్ఞము యీ మొదలయిన క్రియలనుచేసుటవల్ల బాధ యేమైనా వుండునా?

వృ : మంచిది భూమి యందు యెందరు మనష్యులు వున్నారో అందరికీ పాప స్వభావము కలదా లేదా?

ప : అవును పాపముతో కూడి యుండడము వాస్తవమే యెందుకంటే సమస్తమైన వారియొక్క మనస్సులో కామక్రోధలోభాదులు కలిగి యున్నవి.

వృ : అయితే పరిశుద్ధము కాని మనస్సుతో యే యే కర్మములను చేసినా అవి అన్నీ నిష్ఫలమే యిందుకు ప్రమాణము భాగవతమందు వ్రాయబడి యున్నది యేమంటే-

"యది హృదయమశుద్ధం తస్య సర్వం విరుద్ధం"॥

యెవ్వనియొక్క హృదయము పరిశుద్ధముకాదో వాని యావ త్కార్యములున్ను పరిశుద్ధములు కావు. మరిన్ని చూడుము. క్రియలు చేయక మునుపు మనస్సు యేలాగున వుండెనో క్రియలు చేసిన తరువాత నున్ను ఆలాగునే వుండును విశేషమేమిన్ని లేదు. యిందు చేతను క్రియల మీద మాత్రమే మనస్సు వుంచి కూర్చుండుట హానికరమవును. మనుష్యులచేత చేయబడిన ప్రాయశ్చిత్తాది కర్మములవల్ల పాపము పోనేరదు.

ప : అయ్యా నీ మాటలను విని నాకు యే యే నమ్మికలు వుండెనో అవి యెగిరి పోయినవి. యిప్పుడేమి చేయవలెనో దాని గురించి తలుస్తున్నాను. ఓ అయ్యా గురువు యేమి చెప్పుతున్నాడో దాని మనస్కరించి కృతార్ధుడను కావచ్చునా లేదా?

వృ : ఓ సహోదరుడా, యిది మిక్కిలీ భ్రమను కలుగచేసే దొంగ మాటయై యున్నది. చూడుము అందరూ పాపులయితే గురువులు కూడా పాపులే గనుక వారు తమవంటి పాపులకు యేలాగు పనికి వస్తారు మరిన్ని చూడుము పాపమువల్ల మనస్సు అంధకారమవును. వొక గుడ్డివాడు మరియొక గుడ్డివానికి యే ప్రకారము తోవ చూపించగలడు? మరిన్ని మీ యొక్క తంత్రసార మందు వ్రాయబడి యున్నది. యేలాగంటే-

"గురవో బహవస్సంతి శిష్య విత్తాపహారకాః" ।
"దుర్లభస్సద్గుర్లోకే శిష్య హృత్తాపహారకః" ।

శిష్యుల యొక్క ధనమును హరించే గురువులు అనేకులు గలరు అయితే శిష్యులయొక్క హృదయతాపము హరించే గురువు లోకమునందు దొరకడము దుల్లభము.

ప : అయ్యా యిదంతా యెప్పుడు విఫలమాయెనో అప్పుడు అడవికి పోయి తపస్సు చేయుట వుచితమేమో?

వృ : మంచిది తపస్సు చేసి రక్షణను పొందుటకు కోరుతున్నావు. చూడుము దేవుడు మనుష్యునికి యిహమున్ను పరమున్ను యిచ్చి యున్నాడు. యిందు నిమిత్తము యిహము యొక్క ధర్మమును ఆచరించక అడవికి పోవుట దేవుని అలక్ష్యము చేసినట్టున్నది యేలాగంటే యజమానుడు సేవకుని సుఖము కొరకు అతనికి కొంత సొమ్ము యిచ్చి ఓ సేవకుడా నీవు సుఖముగా అనుభవిచుమని చెప్పితే అందుకు అతడు

ఆలాగున సమ్మతించక ఆ సొమ్ము యావత్తున్ను నీటిలో పారవేస్తే అందుకు యజమానుడు సంతోషించు నా వాని యందు కోపగించునా? మరిన్ని జనులందరూ పాపిష్ఠులే గనుక వొకడు మాత్రమే కాకుండా అందరూ అడవికి పోవడము యుక్తమే. అందరూ యెప్పుడు అడవికి పోవుదురో అప్పుడు అడవి పోయి పట్టణమవును. మరిన్ని చూడుము సమస్తమైన వారున్ను తమ తమ శక్తికొద్దీ వొకనికి వొకడు వుపకారములను చేయవలెనని దేవుని యాజ్ఞ కలిగి యున్నది. అయితే అడవికి పోయి ఆలాగు వుపకారము చేయకపోవుట వల్ల దేవుని ఆజ్ఞను మీరడమై యున్నది. యిందువల్ల పాపము పోక మిక్కిలీ యెదుగుతుంది.

ప : అన్ని శాస్త్రముల యందు విరోధమే కనుపడవచ్చును. యేమంటే వొకడు విధించును. దాని మరియెకడు నిషేధించును. కాబట్టి యే శాస్త్రమైనా యే మతమైనా నిజము కాదు కాబోలును.

వృ : చూడుము సహోదరుడా యెవడైనా వొకడు కాశికి వెళ్లగలందు లకు తలంచి నేను యే తోవను కాశికి వెళ్లగలనని యడిగెను. అందుకు వొకడు దక్షిణముఖముగా వెళ్లుమని చెప్పినాడు. ఆ మాట మీద యెంతో దూరము దక్షిణముగా పోయి ఓ సహోదరుడా, నేను కాశికి యెట్లా పోవలసినదని మరి యొకని యడిగెను. వాడు తూర్పు ముఖముగా పోతే వేగిరము వెళ్లగలవని చెప్పెను. అప్పుడు వాని మాట మీద కొంత కాలము తూర్పు ముఖముగా పోయి యింకొకని చూచి ఓ నా సహోదరుడా అనేకులు అనేకమైన తోవలు చెప్పి యున్నారు. అయితే నీవు నిశ్చయముగా చెప్పుము. నేను కాశికి యేతోవను పోవలెనని యడిగెను. అతడు వుత్తర ముఖముగా వెళ్లుమని చెప్పెను. దాని వల్ల వుత్తరముఖముగా పోయి, యింకొక మనుష్యుని ఓ యన్నా, నేను కాశికి యే దారిని వెళ్లుదునని యడిగెను. అతడు నీవు పశ్చిమ ముఖముగా వెళ్లితే చేరగలవని చెప్పెను కాగా వానికి కాళ్ల కష్టమే గాని యెంత మాత్రమున్ను కాశికి వాడు చేరలేదు. ఈ మాటను నీ మనస్సులో తలపోసి చూడుము.

ప : అయ్యా నేను బహు మూర్ఖుడను యేమి చెప్పగలను. నా మనస్సువల్ల విచారించి చూస్తే యిది యంతా సత్యము కాదు. యెందుకంటే వొకదాని కొకటి విరోధమైనందున మాటల యందు సత్యము లేదని యనుకొంటిని.

వృ : నీవు బాగా యెరిగి యున్నావు. ఆ చొప్పున నీ యొక్క శాస్త్ర మార్గములన్నిటిని తెలుసుకొని చూడుము. ప్రతి శాస్త్రము తన శ్రేష్ఠత్వమును చెప్పుతున్నది. మరిన్ని అన్ని శాస్త్రములు వొక వేళ సత్యమైనవైనప్పటికీ వాటిలో యెంత మాత్రమున్ను రక్షణతోవలేదు.

ప : యెందుకు లేదు పాపము నాశమైతే రక్షణ కాదా?

వృ : వినుము సహోదరుడా, పాపము నాశమై వానికి సర్గ భోగాను భవమైనప్పటికిన్ని ఆ స్వర్గభోగమైన తరువాత యింకొక సారి యీ లోకమునకు రావలసి యుంటే యేమి ప్రయోజనము. యే చొప్పున వానికి రక్షణ కలదని చెప్ప వచ్చును. యేలాగంటే వొకడు మిక్కిలీ పెద్ద నదిలో పడి బహు శ్రమచేత వొక సారి వొడ్డు దగ్గిరకు వచ్చి అలసటగా ఆ సమయమందు పెద్ద పెద్ద తరంగములు వచ్చి మళ్లీ వాని నడిమికి తీసుకొని పోతే అందువల్ల వాడు అత్యంత దుర్బలుడై తిరిగీ యొడ్డు దగ్గిరికి యెంతో కష్టము చేత వచ్చును. మరిన్ని యింకొక మారు పెద్ద సుడి వాని లోపలికి తీసుకపోవచ్చును. యీ చొప్పున సారెసారెకు కావడమువల్ల వాడు యెప్పటికిన్ని యొడ్డుకు చేరలేడు. ఆ చొప్పుననే మీలో చెప్పబడిన స్వర్గానుభవము. మరిన్ని అది కేవలము పాలీ వృష్ఠము వంటిది యేమంటే వొక దినమున ఆ వృష్ఠము వచ్చును రెండవ దినమున రాక నిమ్మళముగా వుండును కాగా వాడు యే చొప్పున రక్షణ పొందినాడని తెలుసుకొందుము.

ప : అయ్యా యీ మాట విని నేను మిక్కిలీ అధైర్యముగా వున్నాను. నా మనస్సులో యేలాగైనా స్వర్గభోగము అనుభవించ గలందులకు కోరికై యుండెను నీవు వొక మాట చేతనే దాని ఖండించితివి. నీ యొక్క మాటవల్ల పాపానుభవము కాకపోతే ముక్తి లేదని తెలుసుకొన్నాను.

వృ : వినుము సహెూదరుడా, హిందూల శాస్త్రములలో వొక స్థలమందు గంగాస్నానము చేస్తే పాపము పోవుననిన్ని యింకొక చోట జగన్నాథుని దర్శన స్పర్శనములవల్ల పాపము నశించుననిన్ని చెప్పి యున్నది. మరిన్ని నానా స్థలముల యందు రామస్మరణ వల్ల సుగతి కలుగుననిన్ని ప్రాయశ్చిత్తము చేస్తే విముక్తి కలుగుననిన్ని మరిన్ని వొకడు ప్రతిమలయొక్క పూజచేసినా, దైవముల సేవ చేసినా స్వర్గభోగమును పొందుననిన్ని చెప్పియున్నది. మరిన్ని మిక్కిలీ యాశ్చర్యముగా యింకొక స్థలమందు పాపానుభవము కాకపోతే తరించనేరదని వ్రాయబడి యున్నది. అందుకు స్మృతి శాస్త్రమందు వ్రాయబడి యున్నది యేమంటే.

**"ఆవశ్యమనుభోక్తవ్యం కృతంకర్మ శుభాశుభం"!**
**"అభోక్తమక్షయంకర్మ కల్పకోటి శతైరపి"!**

లోకులు యే పాప పుణ్యములు చేతురో వాటినన్నిటినిన్ని వారు అవశ్యముగా అనుభవింతురు. యేమంటే వాటిని అనుభవిం చకపోతే అనేకకోటి కల్పములకైనా వాటి యొక్క క్షయము కానేరదనే అర్ధము. కాగా యీ పరస్పర విరోధమైన మాటలలో నిజమైన దాని యేలాగు కనుగొందుము?

ప : అయ్యా నేను వొక మాట అడుగ కోరుతున్నాను.

వృ : యే మాట. చెప్పుము నేను వింటున్నాను.

ప : నా మనస్సులో యీ మాట యుదయిస్తున్నది. యీ సమస్త మతములు ఐక్యము కావు అందునిమిత్తము అనుమానిస్తున్నాను. యే శాస్త్రములు పరస్పర విరోధములై యున్నవో అవి అన్నిన్ని యొక పక్షము మనుష్య కల్పనలే. దేవునివల్ల దత్తమైన శాస్త్రములై యుంటే వాటిలో యిటువంటి వ్యత్యాసములు లేకపోవును. యెందుకంటే సర్వజ్ఞుడైన దేవునికి భ్రమలేదు. నీవు యే చొప్పున సెవలిస్తున్నావో గాని నాకు యీ చొప్పున బోధపడ్డది.

వృ : నీ మనస్సులో వుదయమైనది ప్రమాణమే మరిన్ని యిందు వల్ల నేటి వరకు నీవు రక్షణయొక్క నిజమైన మార్గము కానకుండా వుంటివని బోధిస్తున్నది.

ప : అవును అవునయ్యా యెవ్వరున్ను రక్షణను పొందలేరు. యిది మిక్కిలీ దుఃఖకరమైన మాట. లోకులకు అందరికీ యిహమందున్ను పరమందున్ను కూడా దుఃఖమే కలుగును. దేవుడు మనుష్యులను కేవలము దుఃఖము అనుభవింప చేసే నిమిత్తమే సృష్టించి యున్నాడా రక్షణ మార్గము అగుపరిచేది యేదైనా యొక శాస్త్రమును చూపించినాడు కాడా?

వృ : ఓ సహోదరుడా, యీ నీయొక్క మాట నిశ్చయము కాదు. యీ దేశము కాక యింకా జగత్తులో యెన్ని దేశములు వున్నవి మనయొక్క దేశమందు రక్షణ అగుపరిచే శాస్త్రము లేకపోయిన పక్షమందు మరియొక దేశములో వెతికితే దొరుకును. యేలాగంటే గడియారము, అచ్చు, దూర్బీను, మెరుపుటప్పా మొదలైన వాటిని కలుగ చేసే విద్య–పూర్వమందు యీ దేశములో లేకుండెను. యిప్పుడు సీమదేశస్థులు యీ దేశమునకు వచ్చినందువల్ల యీ దేశస్థులలో అనేకులు సమస్తవిద్యలను యేలాగు నేర్చుకొన్నారో ఆ చొప్పుననే రక్షణ శాస్త్రవిషయమైయిన్ని ప్రయత్నము చేస్తే సంపూర్ణముగా సిద్ధించవచ్చును.

**ప :** ఓ అయ్యా, నేను మిక్కిలీ అజ్ఞానిని. యెక్కడికి పోయి వెతుక గలను యెవరు నాకు దయ చేతురు. మరిన్ని దొరికితే యే చొప్పున దాని గ్రహింతును. యిది ప్రధాన శాస్త్రము గనుక రక్షణయొక్క మార్గము తెలుసుకొనుటకు నాకు మిక్కిలీ మనస్సుగలదు. యెందుకంటే నేను యే యే పాపములను చేసి యున్నానో వాటిని యిప్పుడు తలంచితే మిక్కిలీ భయమును పొందుతున్నాను.

**వృ :** పాపము వల్ల శ్రమకలుగునని భయపడడము మంచిది. యెందుకంటే భయము లేకపోతే పాపమునుంచి విముక్తి పొందవలెననే విచారము లేకపోవును. రోగమందు లక్ష్యము లేకపోతే ఔషధము పుచ్చుకోవలెననే విచారము లేకపోవును. పూర్వమందు నేనున్ను పాప విషయమై నీ వలనే భావిస్తూ వుంటిని. అయితే చాలా విచారించి కడపట ఆ ప్రధాన శాస్త్రమును దొరికించుకొన్నాను.

**ప :** ఆ శాస్త్రముయొక్క పేరేమి? అందులో పరలోక మార్గమును గురించి యేమి చెప్పి యున్నది! మరిన్ని అది దేవుని చేత యివ్వబడ్డ శాస్త్రమని యే చొప్పున తెలుసుకోగలము.

**వృ :** సహోదరుడా, ప్రధాన శాస్త్రముయొక్క లక్షణములను వినుము. యే శాస్త్రమందు దేవుని యొక్క సమస్తమైన వాక్యములకు యేకత్వము కలిగి యుండునో, మరిన్ని యే శాస్త్రమందు దేవుని యొక్క మహిమయున్ను సత్యమైన గుణములున్ను ప్రకాశములుగా అగుపడి యుండునో, మరిన్ని యే శాస్త్రము మనుష్యుల యొక్క మనస్సులను దేవుని విషయమై ప్రేరేపణ చేసునో మరిన్ని యే శాస్త్రము రక్షణార్థమై యిది అత్యవశ్యమైన మార్గమని తెలియ చేసునో అది దేవుని వల్ల యివ్వబడ్డ ప్రధాన శాస్త్రమని బోధపరుచు కొనుము. బైబిలనే దేవుని గ్రంథమందు యిటువంటి లక్షణములన్నీ పట్టి యున్నవి. అందులో పరలోకమార్గమును గూర్చి యేమి చెప్పి యున్నదో దాని చెప్పుతున్నాను. వినుము.

ప : మంచిదయ్యా నీవు యెప్పుడు అనుగ్రహము చేతువో అప్పుడు నేను అవశ్యముగా విందును.

వృ : చూడుము. ఆది యందు దేవుని యొక్క ఆజ్ఞ వల్ల భూమిన్ని సూర్య చంద్ర నక్షత్ర స్థావర జంగమాది యావత్ప్రపంచమున్ను సృష్టియాయెను. అటు తరువాత మన మొదటి తండ్రియైన ఆదామనే పేరుగల వారినిన్ని, మన మొదటి తల్లియైన హవ్వయనే పేరుగల దానినిన్ని సృష్టించి దేవుడు వారికి యొక నిబంధనను చేసినాడు. వారు యెంత పర్యంతము ఆ యాజ్ఞను గైకొన్నారో అంత పర్యంతము నిష్పాపులున్ను నిరోగులున్ను అయ్యుండిరి. తరువాత వారు ఆ దైవాజ్ఞను మీరినందున మనస్సు పాపమునకు లోబడి కామక్రోధ లోభ మోహ మద మత్సరాదుల చేత పూర్ణులైరి. ఆ చొప్పున వారి సంతానములున్ను ఆ స్వభావమునే వహించినందున మనుష్యులందరూ పాపిష్ఠులై యున్నారని పరిశుద్ధమైన లేఖనముల యందు వ్రాయబడియున్నది. యీలాగు వుండగా మనము యే చొప్పున పుణ్యమును సంపాద్యము చేసుకో గలము! మరిన్ని యే పని వల్ల దేవుడు సంతోషించునో అటువంటి పని యేలాగు చేయగలము? స్వభావము చెడ్డదైతే మన నడతలు మంచివి కావడము యెక్కడనైనా కనిపించునా? యే చెట్టు స్వభావము చేత చెడ్డదో దాని యందు మంచి ఫలములు ఫలించునా?

ప : సత్యమయ్యా నీవు యేది చెప్పుతున్నావో అది ప్రమాణమే. మరియేమైనా సెలవు యిచ్చేదిగలదా?

వృ : కలదు యింకా నేను వొక దృష్టాంతమును చెప్పుతున్నాను విచారించి చూడుము అందరికీ దేవుడు యే యే ఆజ్ఞలను యిచ్చి యున్నాడో వాటిని వారు మనోవాక్కాయముల చేత గైకొనవలెను. అయితే మనము యిహమందు చేసిన కార్యములు చూస్తే మనోవాక్కాయముల చేత దేవుని ఆజ్ఞలను మీరుతున్నాము. మరిన్ని మనుష్యులందరున్ను తమతో

సమానముగా యితరుల యందు దయగా వుండవలెను. యీ దృష్టాంతము చేత దేవుడు మనుష్యులకు యిచ్చిన యాజ్ఞలు తేటగా నీకు బోధించబడ్డవి గదా?

**ప :** అవునయ్యా నాకు భోధించబడ్డవి ఆ సమస్తమైన ఆజ్ఞలున్ను యధార్థమైనవి అయి యున్నవి.

**వృ :** మరిన్ని మనము తోడబుట్టిన సహోదరులను యేలాగు స్నేహించి వారి యొక్క క్షేమము కోరి విచారించవలెనో ఆలాగే మనుష్యులందరూ దేవుని యొక్క పిల్లలై యున్నారు గనుక మనమందరము వొకని యందు వొకడు స్నేహముగా వుండవలెనని దేవుడు ఆజ్ఞాపించి యున్నాడు.

**ప :** ఓ అయ్యా యీ వాక్యములన్నీ నిజమయినవౌను. అవశ్యము వీటిని మనస్కరించ వలసియున్నది.

**వృ :** మంచిది మరిన్ని వినుము. మనము దేవుని యొక్క ఆజ్ఞలను బొత్తిగా మీరి యున్నాము. యేమంటే దేవుని యొక్క యాజ్ఞలు రెండు భాగములై యున్నవి. వాటిలో ప్రథమ భాగము దేవుని విషయమైనదై యున్నది. ఆ ఆజ్ఞ చూస్తే మనము కేవలము పాపిష్ఠులమై కనుపడు తున్నాము. మరిన్ని యే వస్తువు యొక్క గుణమునైనా యేమనుష్యుని యొక్క గుణమునైనా మనము శ్రద్ధగా యెప్పుడు వివేచన చేయక పోవుదుమో అప్పుడు ఆ వస్తువు యందైనా ఆ మనుష్యుని యందైనా కలిగిన సుగుణమును గ్రహించలేక పోవుదుము. ఆలాగుననే దేవుని విషయమైయిన్ని యెప్పుడు మనము దేవుని మరిచి పోవుదుమో అప్పుడు నిశ్చయముగా మనము ఆయన స్వభావము యెరుగక పోవడమే కాకుండా ఆయన కోపమునకు పాత్రులమవుతున్నాము. యెందుకంటే అప్పుడు మనము ఆయన యందు భక్తిగా వుండలేము. ఆయనను సంతోష పరచలేము. మంచిది రాత్రిన్ని పగలున్ను దేవుని విషయమై నీవు యేదైనా

భావన చేసేవాడవా? మరిన్ని ధన సంపాద్యము అన్నవస్త్రములు యిల్లు కీర్తి మొదలైన క్షణమాత్ర భ్రాంతి గల యిహ సంబంధమైన చింతలలో సర్వదా మనస్సు మునిగి యుండును. యీ హేతువు చేతను మనము దేవుని కంటే యీ సమస్తమైన వస్తువుల యందు ఆశ కలిగిన కొద్దీ ఆయన యొక్క ఆజ్ఞలను గైకొనకుండా వున్నాము. యెందుకంటే మనము ఆయనను నిండు మనస్సుతో స్నేహించి ఆయన యొక్క ఆజ్ఞలను మనోవాక్కాయముల చేత సంపూర్ణముగా గైకొనవలెను.

**ప :** అవునయ్యా, దేవుని యాజ్ఞలు కలిగిన ప్రథమ భాగమును మనము మీరి యుండడము స్పష్టమే. అయితే రెండవ భాగమందు యితరుల యందు దయగా వుండవలెనని వ్రాసియున్నదే. యిందువల్ల నేను నిష్పాపినై యుండవచ్చునని అనుకొంటున్నాను.

**వృ :** మంచిది నిన్ను నీవు నిర్దోషిగా చెప్పుకొంటున్నావు అది శోధించితే తెలియబడును. యేమంటే నీవు మనోవాక్కాయము లన్నిటి వల్లనూ యీ ఆజ్ఞను మీరినట్టుగా నాకు కనుపడుచున్నది. చూడు తమ్ముడా అన్యుని యొక్క యే వస్తువు మీదనైనా ఆశ పుట్టుట లోభమై యుండును. మరిన్ని వాని భ్రమపెట్టి దాని తీసుకొని పోవుటకు యే కపటమును చేసియైనా, అబద్ధమును చెప్పియైనా, మరిన్ని రాజభయమైనా, అమర్యాదయొక్క భయమైనా లేక పోయినప్పటికిన్ని కలిగేట్టు చేసి వాని వుపద్రవపరిచి అది తీసుకొని పోదువు. మరిన్ని చెప్పుతున్నాను వినుము. నీ యొక్క అంతరంగమైన వాడు యెదుట అగుపడేటప్పుడు నీ మనస్సు సంతోషమువల్ల ఓ సహోదరుడా, నీవుపరమ ధార్మికుడవు దయ దాతృత్వము పరోపకారము సత్య వాక్యము గలవాడవని యీ ప్రకారముగా నానా విధముగా పొగడి వినయము చేసి యుందువు. మరిన్ని వాడు నీ ముందర లేనప్పుడు నీతో యెవరైనా వాని గురించి ప్రశంస చేసితే అప్పుడు నీవు వాని గురించి విరోధముగా చెప్పుదువా లేదా! వాడు

మిక్కిలీ చెడ్డవాడైనా, అబద్ధికుడైనా, కపటస్థుడైనా, లోభియైనా, పరహింసకుడైనా, కాకపోయినా అటువంటి దోషములు అతని యందు వున్నవని కల్పించి అతని నింద చేతువు గదా.

ప : ఈ మాట నిజమే నేను దేవుని స్నేహించే విషయమందున్ను అన్యులను స్నేహించే విషయమందున్ను దేవుని సమస్తమైన ఆజ్ఞలను మీరి యున్నాను. యిందు నిమిత్తము నేను మహా పాపిని యిందుకు యెంత మాత్రమున్ను సందేహము లేదు.

వృ : ఔక్క నీవు మాత్రమే కాదు సమస్తమైన వారున్ను పాపులే మరిన్ని చూడుము లోభము, డాంబికము, హింస, కామము, క్రోధము యీ మొదలయిన మనస్సంబంధమయిన నానా విధపాపములు సమస్త మనుష్యుల యందున్ను వుండును. మరిన్ని దొంగతనము, నరహత్య, వ్యభిచారము, మాయ యీ మొదలైన పాపముల కొరకు అన్యలోకమందు అనుభవము కలుగును. మనుష్యుడు సర్వజ్ఞుడు కాడు అయితే దేవుడు సమస్తమునకున్ను సృష్టికర్త గనుక ఆయన సమస్తమున్ను చూడగలడు యెందుకంటే ఆయన సర్వవ్యాపకుడు అందు నిమిత్తము సమస్తమైన వారికి తెలిసినా తెలియకపోయినా యెవరు దేని చేతురో ఆయన అది అంతా చూచును.

ప : అది సత్యము. దేవుడు సమస్తము యెరుగుననే వాక్యము సత్యమే. అయితే పాపమును గురించి యెరిగిన్ని ఆయన మనస్సులో వుంచుకొనడు.

వృ : ఓ సహోదరుడా, అది మిక్కిలీ అజ్ఞానమైన మాట. ఆయన యీ సమస్త పాపములను తెలుసుకోవడము మాత్రమే కాకుండా యథార్థమైన న్యాయవిచారణ చేసేటందుకు వాటిని బాగా చూచి మనస్సు యందు వుంచుకొంటున్నాడే గాని ఆయన యెప్పటికిన్ని మరువడు. మరిన్ని యిహమందు యెవడు యెంత పాపము చేసునో పరమందు వానికి అది

దండనవల్ల అనుభవమవును. ప్రభువు మిక్కిలీ దయ గలవాడనే వాక్యము సత్యమే. అయితే దయ నిమిత్తమై ఆయన విధించిన పరిశుద్ధ న్యాయమును తప్పించడు. యెప్పుడు ఆయన దోషిని విడిపించునో అప్పుడు లోకులు ఆయనను నిర్లక్ష్యము చేతురు. కాబట్టి దేవుడు తన ఆజ్ఞను మీరిన వారికి దానికి అనుకూలమైన దండన అనుభవింప చేయక మానడు.

ప : అయ్యా దేవునియొక్క శాస్త్రము యెటువంటిదో దాని నేను బాగా యెరుగను. అనుగ్రహించి దాని నాకు తెలియ చేయుము.

వృ : అది యెటువంటిదో దాని గురించి చెప్పుతున్నాను వినుము. యీ లోకములో సమస్తమైన మనుష్యులున్ను పుట్టినది మొదలుకొని నానా విధములయిన పాపములను చేసి యున్నారు గనుక క్షమాపన పొందక యెవరు చత్తురో వారియొక్క ఆత్మలు అత్యంత దుఃఖము అనుభవించే స్థలమందు న్యాయపు తీర్పు దినము పర్యంతమున్ను వుంటవి - ఆ దినమందు దేవుని యొక్క సామర్థ్యమువల్ల సమస్త మనుష్యులున్ను తమ తమ శరీరమలతో పునరుత్థానమవుతారు. మరిన్ని మహా విచారన చేసే న్యాయ కర్తయున్ను ప్రభువున్నయిన యేసుక్రీస్తు యెదుట సమస్తలోకులు నిలుపబడుతారు. విచారణయైన తరువాత దేవుడు సైతాననే పిశాచి నిమిత్తమున్ను దాని యొక్క దూతల నిమిత్తమున్ను సిద్ధము చేసిన నరకాగ్నిలోకి దురాత్ములందరున్ను తోసివేయబడి అనంత కాలము శిక్షను అనుభవిస్తారు. అక్కడ భయంకరమయిన అంధకారమున్ను రోదన ధ్వనులున్ను పండ్లు కొరకడమున్ను యెన్నటెన్నటికిన్ని కలిగి యుంటవి. మరిన్ని ఆ స్థలమునుంచి పారిపోయి బ్రతుకుటకు యే యుపాయమున్ను లేదు.

ప : అయ్యయ్యో నా పాపమునకు యథార్థమైన ఫలము దేవుని యొక్క కోపమే దీనికి నేను వొప్పుకొంటున్నాను. అయితే ఆయనయొక్క కోపాగ్నియే చొప్పున ఆరునో దానికి యేమైనా ఉపాయముంటే నీవు అనుగ్రహించి చెప్పుము.

వృ : ఓ సహోదరుడా దేవుడు పరమదయాళుడయి యున్నాడు. యిదిన్ని గాక ఆయన ఘోరమైన నరకమునుంచి మనుష్యులు రక్షింప బడుటకు వొక మార్గమును ప్రకటింప చేసి యున్నాడు యేలాగంటే దేవుడు యీ లోకమందు మిక్కిలీ దయ వుంచి తన అద్వితీయమైన కుమారుని పంపించి యీయన యందు యెవరు విశ్వాసము వుంచుదురో వారు నశించక శాశ్వతమైన జీవము పొందుదురని సెలవు యిచ్చి యున్నాడనిన్ని, పరలోకమునుంచి వచ్చిన ప్రభుమైన యేసుక్రీస్తు యనే ఆ రక్షకుడు ముప్పయి మూడు సంవత్సరములు యీ లోకమందు వుండి మనుష్యులకు అనేకమైన యుపకారములు చేసినాడనిన్ని ఆయన అంధులకు చూపు యిచ్చినాడనిన్ని, చెవిటివారికి వినికిడి కలుగ చేసినాడనిన్ని, రోగులను బాగు చేసినాడనినిన్ని, చచ్చినవారికి జీవము యిచ్చినాడనిన్ని యింకా యనేకమయిన అద్భుతములను చేసినాడనిన్ని మరిన్ని తన సుఖము యెంత మాత్రమూ విచారించక రాత్రిన్ని పగలున్ను దేవుని కార్యము చేసినాడనిన్ని అందు నిమిత్తము మనుష్యులు ఆయనకు అనేకమయిన ఆపదలను కలుగ చేసిరనిన్ని, అయినప్పటికీ ఆయన మనుష్యులందరి యొక్క ఆత్మ రక్షణ నిమిత్తము తన జీవము బలిగా యిచ్చినాడనిన్ని దేవుని గ్రంథమందు వ్రాయబడి వున్నది.

ప : అయ్యా ఆయన యే చొప్పున ప్రాణము యిచ్చెను?

వృ : క్రీస్తు పాపాత్ముల నిమిత్తమై మరణమును పొందునని దేవుడు ముందుగా తన దివ్య జ్ఞానులనోట పలికించిన మాట నెరవేరేటట్టు దుష్టులు స్వేచ్ఛగా ఆయనను తీసుకొని పోయి శిలువ అనే స్తంభము మీద కొట్టి చంపిరి. యీ చొప్పున ఆయన మరణమును పొందెను.

ప : అయ్యా యిది మిక్కిలీ ఆశ్చర్యమైన మాట అయితే ఆయన మరణ దశలోనే నిలిచి యుండెవా!

వృ : లేదు తమ్ముడా, ఆయన మృత్యువును జయించి మూడవ దినమందు సమాధిలోనుంచి జీవముతో లేచెను. అటుతరువాత తన శిష్యులకందరికీ దర్శనమిచ్చి నలుబది దినములు వారితో కలిసి మెలిసి యుండి తరువాత వారు చూస్తూ వుండగా స్వశక్తివల్ల పరలోకమునకు యెక్కిపోయి దేవుని కుడి పార్శ్వమందు కూర్చుండెను. మరిన్ని లోకులందరి పయిన అధికారము గలవాడై అంత్యదినమందు యావన్మనుష్యులను విచారన చేయుటకు ఆయన పరాక్రమముతోనున్ను మహామహిమతో నున్ను తిరిగీ వచ్చును. అప్పుడు ప్రతి మనుష్యుడున్ను ఆయనను చూచును.

ప : అయితే యేసుక్రీస్తు వల్లనే గాని మరియొకని వల్ల పాప విమోచనము కానేరదా?

వృ : కానేరదు సహోదరుడా, కేవలము ఆయన వల్లనే విమోచనము కలుగును గాని మరియొవరి వల్లనున్ను కానేరదు. యేమంటే ఆయన స్వభావము చేత నిష్పాపియై యుండిన్ని మన పాప ఫలము అనుభవించెను. యిందువల్ల ఆయన మన కొరకు చేసుకొన్న మహాప్రాయశ్చిత్తము ద్వారా ఆయన యందు సత్యమైన విశ్వాసము వుంచే పాపులను దేవుడు క్షమించును.

ప : యీ శుభవర్తమానము మిక్కిలీ ప్రమాణమే. అయితే ఆ మహాప్రాయశ్చిత్తము సమస్తమైన దేశస్థుల కొరకై యుండెనా? అందువల్ల నేను కూడా రక్షణ పొందగలనా?

వృ : అవును సహోదరుడా, క్రీస్తుయొక్క ప్రాయశ్చిత్తము కేవలము వొకని కొరకు మాత్రమే కాదు. సమస్త దేశస్థులైన మనుష్యుల రక్షణ నిమిత్తమని శాస్త్రమందు వ్రాయబడి యున్నది. రక్షణ మరి యెవరి వల్లనున్ను కలుగదు. యేమంటే భూమి మీద వుండే మనుష్య లందరికీ యేసుక్రీస్తు గాక మరియొక రక్షకుడు లేడు. అది గనుక నీవు ఆయనను ఆశ్రయించినట్లయితే నిస్సందేహముగా నీవు రక్షించబడుదువు.

ప : ఓ అయ్యా ఆయన పాపవిమోచణర్థమై యేయే కార్యములను చేసి యుండెనో వాటిని విశేషముగా చెప్పుము.

వృ : చూడుము. దేవుడు ఆయనను మనుష్యుల యొక్క పాపవిమోచనార్థమై నియమించి యున్నాడు. అందు నిమిత్తము ఆయన మనుష్యులయక్క పాపమును గురించి నానా కష్టములను వహించి వారి రక్షణకొరకు అంతమందు తన ప్రాణము బలిగా యిచ్చెను.

ప : మనుష్యుల రక్షణ కొరకు తన ప్రాణము అర్పించుటకు దేవుని చేత నియమించబడెనా?

వృ : ఆయన మనుష్యుల కొరకు చేసుకొన్న ప్రాయశ్చిత్తము దేవుడు అంగీకరించినాడు. యెవడైనా పాపమునుంచి విడుదల పొందే కొరకు యీ ప్రాయశ్చిత్తమందు నిజముగా విశ్వసించితే వాడు నష్టమును పొందక నిత్యజీవమును పొందునని దేవుడు మాట యిచ్చియున్నాడు.

ప : మరిన్ని ఓ అయ్యా నేను యేసుక్రీస్తు యే చొప్పున ఆశ్రయింతును?

వృ : నీవు నిజముగా ప్రభువైన యేసుక్రీస్తును ఆశ్రయించుటకు యిచ్ఛ గలవాడవై యుంటే పాపమును గురించి పశ్చాత్తాపపడి ఆ రక్షకుడైన యేసునే నీ రక్షకునిగా అంగీకరించి యితరమైన ఆశ్రయములను కేవలము విడిచి యీయనే తన మరణ పుణ్యమువల్ల నాకు పాపపరిహారమున్ను, నిత్యమైన జీవమున్ను, భాగ్యమున్ను దయ చేసునుగదా అని ఆయననే నమ్మవలెను అలాగున నమ్మే వారు యేసును ఆశ్రయించి వెంబడించి ఆయన వల్ల పరమభాగ్యము పొందుదురని దేవుడు ఖరారు చేసి యున్నాడు.

ప : అయ్యా పాపవిషయమై పశ్చాత్తాపమనగా యేమిటి?

వృ : చూడుము సహోదరుడా, దేవుని ఆజ్ఞలను మీరి ఆయనకు అసహ్యమైన కార్యములను చేసినందున అంతరంగమందు దుఃఖపడి అటువంటి కార్యములన్నిటిని మానివేసి ఆయనకు అనుకూలమైన క్రియలు సమాధానముగా చేయడము నిజమైన పశ్చాత్తాపమై యున్నది.

ప : మరిన్ని ఓ అయ్యా మనుష్యుని యొక్క హృదయము పాపపు కోరికెల చేత నిండి యుండును గదా వాడు దేవుని ఆజ్ఞను యే చొప్పున గైకొనగలడు?

వృ : సహోదరుడా, అది ముఖ్యమైన విచారణ. మనుష్యుల యొక్క స్వాభావికమైన స్థితిని చూస్తే వారు దేవునికిన్ని ఆయన యొక్క నీతికిన్ని విరోధులైయున్నారు. అయితే ఆయన మిక్కిలీ దయగలవాడై తన కుమారుని మనకు రక్షకునిగా దయ చేయడము మాత్రమే కాకుండా ఆ రక్షకుని అంగీకరించి ఆయన ద్వారా దేవుని తట్టు మనస్సు తిప్పుకొనే వారెవరో వారికి తన పరిశుద్ధాత్మను కూడా యిచ్చెదనని కరారు చేసి యున్నాడు. ఆ పరిశుద్ధాత్మవచ్చి నమ్మేవాని హృదయము నూతనపరిచి పరిశుద్ధము చేసును. గనుక అటువంటి వాడు దేవుని స్నేహించి పరిశుద్ధాత్మ సహాయమువల్ల ఆయన ఆజ్ఞల చొప్పున నడుచుకొనును.

ప : నా యొక్క పాపములు అనేక విధములైనవిన్ని మిక్కిలీ భారము గలవిన్నైనందున యేసుక్రీస్తు యందు దృఢమైన విశ్వాసము వుంచితే నేను దేవుని యెదుట అవశ్యముగా నిర్ధోషిని కాగలనా?

వృ : సహోదరుడా, యేసుక్రీస్తు యొక్క మరణ ప్రాయశ్చిత్తమందు విశ్వాసము వుంచినట్టయితే ఆయన నీతి పుణ్యముల వల్ల దేవుని యెదుట అవశ్యముగా నిర్ధోషివయేటట్టు యెంచబడుదువు. యేమంటే దేవుడు నీ పాపమును క్షమించి నిన్ను సమస్తదండనలనుంచి విముక్తి చేసును. మరిన్ని నీవు పుట్టినది మొదలుకొని యెప్పుడున్ను పాపము చేయనట్టు నిన్ను నీతిమంతునిగా చేసి నీయందు మహాకృప ప్రకాశింపచేసును.

ప : మంచిది దేవుని యెదుట నేను యీ చొప్పున యథార్థవంతుడనైతే యిహమందు యే యైశ్వర్యమునైనా భాగ్యము నైనా పొందగలనా?

వృ : అవును సహోదరుడా, నమ్మే వారికి నానా విధమైన యైశ్వర్యములు సంప్రాప్తమౌను. యేమంటే మనస్సులో క్షేమమున్ను, దేవునితో సమాధానమున్ను, ఆయనకు పిల్లలవుటయున్ను, పరిశుద్ధాత్మయొక్క ప్రాప్తియున్ను, యేసుక్రీస్తు యొక్క బంధుత్వమున్ను, శ్రమలయందు వొస్తున్న పరమానందమున్ను, సత్క్రియలను చేసుటకు బలమున్ను, శాశ్వతమైన జీవమును గురించిన దృఢమైన కోరికయున్ను యీ మొదలైన శుభములు వారికి సంభవించును. అయితే ప్రార్ధన చేయకుంటే నీవు యీసమస్తమైన భాగ్యములను పొందనేరవు.

ప : ఓ అయ్యా, నిజమైన ప్రార్ధన చేసుటకు నాకు మిక్కిలీ కోరిక కలిగియున్నది. అందు కొరకు యే జపమైనా ప్రయోజనమై యుండునా?

వృ : లేదు సహోదరుడా, ప్రార్ధన యే చొప్పున చేయవలెనో దాని నీవు యెరుగవు. చూడుము. నోటివాద్యము వల్లనున్ను చంక వాద్యము వల్లనున్ను వేళ్ల యొక్క ధ్వని చేతనున్ను పాదనాట్యము చేతనున్ను చప్పట్ల చేతనున్ను వ్యర్ధమైన పునరుక్తి చేతనున్ను దేవుని యొక్క ఆరాధన కానేరదు. మరిన్ని ఆయన వీటినన్నిటినిన్ని చూడడు. ఆయన ఆరాధన శుద్ధమైన మనస్సుతోనున్ను భావముతోనున్ను ఆత్మతోనున్ను చేయవలసినది. మనుష్యుడు పొందే శరీర శ్రమ ఆయనకు యెంత మాత్రమూ ప్రయోజనముగా వుండదు. మరిన్ని నీవు నిజమైన ప్రార్ధన చేసుటకు కోరినప్పుడు యేకాంత స్థలమునకు వెళ్లి దేవుని సముఖమందు యేసుక్రీస్తు యొక్క నామము వల్ల - ఓ దయగల కర్తా! నేను మహా పాపిని బాల్యమునుంచి నేటి పర్యంతము పాపమే గాని మరి యేమిన్ని చేయలేదు. నాకు పుణ్యము లేశమైనా లేదు మరిన్ని పాపదండనకు నేను యోగ్యుడనని నిజముగా నమ్మియున్నాను. మరిన్ని నా పుణ్యము ద్వారా కాదు, కేవలము ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ప్రాయిశ్చిత్తముద్వారా పాప విమోచనమును కోరుతున్నానని - యీ చొప్పున మనఃపూర్వకముగా

ప్రార్థన చేసితే దేవుడు నీ మనవి ఆలకించి నీ యంతరంగమందు పరిశుద్ధాత్మను ప్రవేశింప చేసును. మరిన్ని నీ మనస్సు యందు పూర్వము యెన్నడున్ను లేని ఆనందమున్ను శాంతమున్ను కలుగును. ఓ తమ్ముడా, ఆలస్యము చేయకుము మృత్యువు మిక్కిలీ సమీపమై యున్నది. చూడుము యెవనికైనా లోకమంతా ఆదాయమైనప్పటికిన్ని అతని ఆత్మనష్టమైతే అతనకి వచ్చే ఫలమేమి.

ప : అయ్యా యిది ప్రమాణమే. యేసుక్రీస్తు చేతనే గాక మరియొక విధమైన రక్షణ లేదు. యిందు నిమిత్తము నేను ఆయన ద్వారా దేవుని వల్ల పాపవిమోచనము పొందే కొరకు వేడుకొనుట అవశ్యము కర్తవ్యమై యున్నది.

వృ : మంచిది సహోదరుడా మనము యిండ్ల యొద్దికి చేరినాము. యీ సమయమందు నీవు వెళ్ల వచ్చును. మనస్ఫూర్తిగా శుభవర్తమానమును వినుము. మరిన్ని దేవుని పరిశుద్ధమైన గ్రంధము ప్రతిదినమున్ను చదువుతూ వుండుము. దేవుడు నీకు శుభము దయ చేసును గాక.